అధికారులూ బందోబస్తుకోసం,- మామూలు దుస్తులలోనే ఉన్న మరో కోర్జం మందీ, వ్యోమమార్గానవచ్చి వ్రాలారు,

స్థానిక అధికారులకు యిదంతా చూడగా మండుకువచ్చింది. తాము పట్టుకున్న కేసు, తమ చేజేతులారా రుజువు చేయబోతున్న కేసు,-పైవాళ్లు ఇలా ఎగదన్నుకు పోవడం ఏమిటని !- 'అది కాదయ్యా ఈ నేరానికి జపానుకూ సంబంధంఉంది: ఈ మత్తుపదార్థం జపాను తయారీ అని నిపుణులు తేల్చారు: ఇలా ఎన్ని చోట్లకు యిది వ్యాపించిందో జపాను గూఢచారులు దేశంలో ఎల్లా నిగూఢంగా,- ఏయే మాసికలు వేస్తున్నారో- ఇది, కీలకం- ఈ తీగె కదిలించి డొంకంతా కదపాలి- వీడిచేత, గూఢచారుల ఆరాలు పలికించాలి - పట్టుకోవాలి. దేశం మొత్తంమీద చిక్కం విసిరి, ఉచ్చులు చేతపట్టుకు కూర్చుంది మన ప్రభుత్వం-' అంటూ ఓ పై అధికారి, విసుక్కుంటున్నట్టు జబ్బ చరుచుకుంటున్నట్టు, ఆంతర్యం వెల్లడించాడు స్థానిక దండ నాథ్యక్షుడికి.

అందరికీ రోషం ఆశ్చర్యం వేసింది ; వెంకటస్వామి దేశానికే ముప్పు తలపెట్టాడా ? - జపాను వాళ్ళతో కలిసి, - కొందరు దేశద్రోహులు మళ్ళీ శాంతి భద్రతలకు భంగం తీసుకురా యత్నిస్తున్నారా ?-

మేజస్ట్రేట్ తామసం చిక్కబట్టలేక,ప్రత్యేకం చెరసాలలో వెంకటస్వామిని దర్శించి, మామూలు పొరుడల్లే — 'ఇంత ద్రోహం తలపెట్టావేం ? - ఇదేనా నీ కాంగ్రెస్ సేవ ? -' అంటూ తనకు వేసిన అసహ్యం అంతా చదివాడు:

వెంకటస్వామి, ఏ మాత్రమూ నొచ్చుకోకుండా - 'అంతే బాబూ ! ఖండఖండాంతరాల్లో ప్రఖ్యాతి కెక్కే దేశద్రోహుల్ని ఒక్క కాంగ్రెస్ తప్ప, మరే సంస్థ తయారు చేసిందండీ ! - ' మేజస్ట్రేట్ ఇది తప్పుడు మాట అని గద్దించాడే కాని ఎలా తిప్పికొట్టాలో తెలియక - యావత్తు సర్వీసు లోనూ ఎన్నడూ కాంగ్రెస్ అంటే అభిమానం చూపించవలసిన అగత్యం రానందువల్ల — 'సరే నీ కర్మం నీది!' అన్న చూపుతో చేతులు దులుపుకున్నాడు.

హేమాహేమీ లందరూ వెంకటస్వామిని పట్టుకుని నిగ్గదీశారు: అతనికీ జపానుకీ ఉన్న లావాదేవీ తేల్చాలని అన్న-హారాలు మాని, కంటి మీద కునుకు మాని-రాచి రంపాన పెట్టారు. చేసిన నేరం చెప్పేసి-గుట్టు బయటపెడితే,-తనకుమాత్రం, ఏ యావజ్జీవ ఖైదుతోనో పోయేట్టు శాయశక్తులా కనికరిస్తామని అభయం యిచ్చారు.

'సరే చెపుతా'నన్నాడు-వెంకటస్వామి-కాయితం కలం అంది పుచ్చుకుని,- తెలుగులో వ్రాసి యిచ్చాడు. తెలుగువచ్చిన అధికారి,-అది చూసి ఉప్పెన వచ్చినట్టు పకాల్ మన్నాడు.- వెంకటస్వామి ఉత్తరక్షణంలో విడుదల అయినాడు. ఊరంతా మరీ బిత్తరపోయింది. ఎలాగో తెలిసిన ఒకరో అరో స్వగతంగా నవ్వుకున్నారు. ఈ గుట్టు వెల్లడి అయితే పెద్ద హోదాలవాళ్ళ ఆబోరు దక్కదని, గోప్యంగానే ఉంచాడు వెంకటస్వామి: గవర్నర్ జనరల్‌కు మాత్రం ఒక్క విజ్ఞప్తి అనుపుకున్నాడు: అందులో ముఖ్య విషయం-

'...ప్రభుత్వంవారు మద్యపాననిషేధం ప్రసాదించినంతమాత్రాన దేశం నిమిషంలో సుభిక్షంలోకి వ్రాలదు: త్రాగుడు మానేసి కాఫీలు టీలు త్రాగమని ఎంత ప్రచారం చేసినా- ఆ ఘాటూ నిషాలకు అలవాటుపడ్డ ప్రాణి-వీటితో పెదవులు కాల్చుకోడు. కనుక, వాళ్లజిహ్వకు అలవాటుపడ్డ గుణాలన్నీ ఉండి, కేవలం ఒక మత్తేకాకుండా నత్తువకూడా యిచ్చే పదార్థం అయి ఉండాలి. అది పేదకూ బిక్కకీ అందుబాటులో ఉండాలి:

అయితే యీ చిదంబర రహస్యం బట్టబయలు చేసి- ఇలా నిత్యమూ పుచ్చుకోమని పురమాయిస్తే- 'ఓష్ యిదేనా!' అని ఏ ఒక్కడూకూడా దాన్ని సేవించడని,- ఇలా గోప్యంగా, ఖర్చుమొత్తం నేనే భరించి, యథాశక్తి ప్రభుత్వం తలపెట్టిన ఉద్యమానికి ఉడతాభక్తి చేస్తున్నాను: యిది సాంగంగా పరిశీలించి మీ దీవెనలు తమ కార్యదర్శి ద్వారా ప్రసాదించమని వేడుకుంటున్నాను. సర్వజ్ఞులైన తమకు నేను, తరవాణి గుణగతాల్ని యింతకు మించి మనవి చేయనక్కరలేదని సెలవు అందుకుంటున్నాను-'